# 23-వ క్రాసు రోడ్

గుంటూరులో బ్రాడీపేటలో ఇరవై మూడవ క్రాసు రోడ్డుమీద మొట్టమొదటి ఇంట్లో ఉంటూన్న ఆ అమ్మాయి ఉన్నదే, ఆమె దక్షిణవైపు కిటికీలోనుంచి ఎప్పుడూ చూస్తూ ఉంటుంది. ఆ అమ్మాయి ఒంటరిగా ఉన్నట్లుంది. పిల్లాజల్లా ఇంకా కలగలేదు. చిన్నపిల్లే.

ఆపిల్లకు అన్నంవండి పెట్టటానికి సంరక్షించటానికీ, మంచీ చెడ్డా చూడటానికి ముసలమ్మ ఒకావిడ ఉంది. ఆవిడ ఎప్పుడూ ఏవో పనులలో ఉంటూ వీధిగుమ్మంలోకి సాధారణంగా రాదు.

ఈ పిల్లమటుకు అందరికీ కనపడుతునేఉంటుంది. ఈ అమ్మాయి ఇంటిపనులు ఏమీచేస్తున్నట్టు కనబడదు. ఎప్పుడూ ఆ కిటికీలోనుంచీ, దూరానఉన్న చెట్లవైపునను చూస్తూ వుంటుంది.

ఆ దూరాన ఉన్నవి, తాటిచెట్లు, ఈ అమ్మాయి విచారంగా వాటితో ఏమి చెపుతుందో, వాటికి ఏమి అర్థం అవుతుందో, ఏమోగాని, మొత్తంమీద అవి తలలూపుతవి.

ఆ అమ్మాయి విచారంగా ఉన్నదీ అంటే మంచిబట్ట కట్టుకోకుండా, తలదువ్వుకోకుండా కూర్చున్నది అనుకున్నారు గదూ మీరు?

చాలా పొరపడ్డారు. అలాంటిది ఏమీలేదు. ఆ పిల్ల ఎప్పుడూచక్కగాకడిగిన ముత్యంలాగఉంటుంది. ముఖం కళకళలాడుతూ లక్షణంగా ఉంటుంది. ఆఅమ్మాయికి ఈ కాలపు

పోకిళ్ళు ఏమీలేవు. చెవులకు దుద్దులేకాని లోలకులులేవు. మధ్యపాపిట తీస్తుందిగాని పక్కపాపిటతీయదు. వాలుజడ వేసుకోదు. బర్మాముడి వేసుకొని చక్కగా ఒకటి రెండు పూలు పెట్టుకొంటుంది.

ఆవీధిని కాలేజీ కుర్రవాళ్ళు, పిన్నా పెద్దా ముసలీ ముతకా ఎంతమందో వెడుతూఉంటారు. కాని, ఆఅమ్మాయి వాళ్ళను చూస్తున్నట్లుండదు. ఏమిటో ఆలోచిస్తూ, ఆదారా నికే చూస్తుంది.

అప్పుడప్పుడుఆడపిల్లలువస్తుంటారు ఆఇంటికి. వాళ్ళకు దొడ్లోఉన్న గులాబీపూలూముద్దగన్నేరు పూలుకోసి ఇస్తుంది.

ఎవరో ఒక ఆయన యాభై సంవత్సరాల మనిషిఇరవై రెండో క్రాసురోడ్డులోనుంచి వచ్చి ఆయింటి ముందుగా వెడుతూ ఉంటాడు.

ఆయనమటుకు ఆ అమ్మాయిని చూచి నవ్వుతూ తల ఊపి 'కులాసాగా ఉన్నావా అమ్మాయీ?' అంటాడు.ఆపిల్ల అక్కడ కూర్చునేఉండి తలఊపి, 'ఆ కులాసాగానే ఉన్నాను బాబాయి' అంటుంది.

కాని తమాషా ఏమిటంటే ఆ పిల్లకు ఆ ముసలా యన ఎవరో తెలియదు. ఆపిల్ల ఆ యింట్లోకి కాపరానికి వచ్చి వారంరోజులు కాలేదు. అందుకని ఆఅమ్మాయిసంగతి ఎవ్వరికి తెలియదు.

ఆముసలాయన ఉన్నది ఆపక్కవీధే అని చెప్పాను. ఆయన మాట్లాడిస్తాడు. పొరుగువారు ఎవరైతే మనకుఎందు కని ఊరుకొనే, స్వభావంకాదు ఆయనది.

ఆయన ఒకరోజురాత్రి భోజనానంతరము చుట్టకాల్చు కుంటూ బైటకు వచ్చేసరికి, తన ఇంటిముందున్న వంతెనపై ఎవరో ఒక కుర్రవాడు కూర్చునిఉండటం చూశాడు. అతనికి పాతికేండ్లపైగానే ఉన్నవి. చామన చాయలోఉన్నా యవ్వ నంలో ఉండటంమూలాన అందంగా కనిపిస్తాడు.

ఆఅబ్బాయి ఆవంతెనమీద కూర్చుని ఏదోఆలోచించు కొంటున్నాడు. మనస్సులో చాలబాధ పడుతూ ఉన్నట్లుగా కూడా ఉంది. అందుకనే ఈ ముసలాయన రావటం ఆ అబ్బాయి గమనించలేదు.

ముసలాయనే ఆ కుర్రవాడిని సమీపించి 'ఏఅబ్బాయ్ ఎవరునీవూ? ఇక్కడెందుకుకూర్చున్నావునాయనా?' అనిఅడి గాడు. నిజానికి ఆ అబ్బాయి ఎవరయితే తనకెందుకు?అది పబ్లిక్ రోడ్డుగదా! ఆరోడ్డుమీద కూర్చుంటే తనకెందుకూ ?

ఆ పిల్లవాడయినా పెద్దమనిషిలాగ ఉన్నాడుగాని ఒక అల్లరి చిల్లర మనిషిలాలేడు. మరియెందుకూ ఆఅబ్బా యిని నిలవేసి ఆ ప్రశ్నలు అడగటమూ అంటే, అదిఆయన గారి స్వభావం.

ఇంతకూ సంగతి ఏమిటంటే, ఆపిల్లవాడుఏమీమాట్లా డకుండా తలవంచుకుకూర్చున్నాడు. ముసలాయనఊరుకొనే మనిషికాదు. మళ్ళీ అడిగాడు. 'ఏవూరు అబ్బాయ్ మీది!'

ఆ అబ్బాయి 'మాది బందరండీ' అన్నాడు. ముస లాయన అంతటితో తృప్తిపడి ఊరుకోక 'అయితేఈవూళ్ళో ఎందుకున్నావు' అని అడిగాడు. ఆ కుర్రవాడు కొంచెము

భయపడ్డట్లుచూచి 'ఇక్కడ బంధువులున్నారులెండి' అనితల వంచుకొన్నాడు.

'ఏ వీధిలో?'

'ఈ పక్కవీధే!' అంటూ ఆపిల్ల ఉన్న ఇంటివైపు చూశాడు.

'అంటే ఇరవై మూడో క్రాసురోడ్డేనా?'

'ఆ, అదే............'

'మొదటి డాబాలోఒక, తల్లీ, పిల్లా ఉన్నారు-అదేనా మీఇల్లు?'

పిల్లవాడు ఏదో వింతగా భయంగా ఆయనవంకచూచి తడబడుతూ, 'అది గాదులెండి. దానికి కొంచెముపైగా ఉంటుంది మేమున్న ఇల్లు' అన్నాడు.

ముసలాయనకు ఏదోఅనుమానంకలిగింది. ఆకుర్రవాడిముఖంలో ముఖంపెట్టి చూశాడు. ఆ వెన్నెలలో ఆకుర్రవాడిముఖం బాగానే కనపడ్డది. ఏదో తప్పు పనిచేస్తుంటే పట్టుబడ్డ వాడిలాగా గాభరాగా చూశాడు ఆ పిల్లవాడు.

ముసలాయనకు బాగా అనుమానం కలిగింది. కళ్లు మూసుకొని ఏవోతనజీవితములో ఒక ఇరవై దృశ్యాలనుమనో వీధిలోచూచి చప్పున కళ్లుతెరచి నవ్వుతూ అన్నాడు. 'అయితే ఆకిటికీలో కూర్చున్నపిల్ల ???'

'అదె అదె!' అంటూ ఆ కుర్రవాడు వంతెనమీది నుంచి చివాలునలేచి వెళ్ళిపోయినాడు!

కుర్రవాడు చాలా విసురుగా వెళ్ళిపోయినాడు. ఆ అబ్బాయి నడిచిపోవటం కనుపడుతూ ఉన్నంతసేపు,అట్లాగే

చూస్తూనిలబడిపోయినాడు ఆ పెద్దమనిషి. చూస్తూ వుండటం గానేఆకుఱ్ఱవాడువెళ్ళిపోయినాడు. ముసలాయనఆరిపోయిన చుట్టను మళ్ళీవెలిగించి'కుఱ్ఱతనంఇంతేగదా!'అనుకొన్నాడు

ఆయన మనస్సు విసనకఱ్ఱలాగా ఊగింది: ఒకసారి ఆపిల్ల వైపు మరొకసారి ఈ పిల్లవాడివైపు.

సాలీడు ఈ మూలనుంచి ఆమూలకూ ఆమూలనుంచి ఈమూలకు ఎగురుతుంది. ఆ ఎగరటంలో అది సన్నని దారాలతో ఈ రెండుమూలలను కలుపుతూ వున్నది. ఈ రెండుమూలలకు సంబంధాన్ని కల్పిస్తున్నది. అలాగే ఈ తాతగారు తన మనస్సులో ఎవ్వరికీ కనపడని దారాలతో ఈ పిల్లల నిద్దరినీ ముడివేసుకొన్నాడు.

'ఆపిల్ల చాలా చిన్నవయస్సులో వుండికూడా ఒంటరిగా. విచారంగా వుంటుంది. ఎందుకా అనుకొన్నాను! పెండ్లయ్యే వుంటుంది ఆ పిల్లకు. కాని భర్త వదిలేసివుంటాడు. పోనీ తప్పేమీలేదు. ఇప్పుడు తెలిసింది సంగతంతా, ఆయన ఇల్లా అనుకొని నోట్లో చుట్ట విసిరి పారవేసిఇంట్లోకి వెళ్ళి గ్లాసుతో నీళ్ళు తెచ్చుకొని పుక్కిలించివుమ్మివేసిపోయి పడుకున్నాడు.

ముసలాయనకు నిద్రపట్టలేదు. ఆ అమ్మాయి భర్త్రృవిహీనఅయినమాటనిజమేఅయినట్లయితే,ఇప్పుడుజరగబోయే పని వలన రాబోయే ప్రమాదం ఏమీలేదు. అట్లాకాక ఆ అమ్మాయి మగనాలిఏమో! ఇదే నిజముఅయితే ఎంతవంచెన ఆ భర్తకు! ఈఆలోచన ఆయనముసలిరక్తాన్నికూడావుడికించింది. చాలా బాధపెట్టింది. ఆ వంచితభర్త పడబోయే బాధ

అంతా ఆయన పడ్డాడు. విపరీతమైన ఆలోచనలన్నీ వచ్చి పడ్డవి. అవి బాణాలలాగ అతనితలలో గుచ్చుకొనిపోయినవి. ఆయనతల ఒక అంపశయ్య అయింది. భరించలేక పోయి నాడు. ఆలోచిచిం ఆలోచించి చివరకు భార్యను పిలిచాడు.

ఆమె పలకలేదు.

'ఏయ్ నిన్నే ఏమిటా మొద్దునిద్ర! ఏమంత ప్రొద్దు పోయిందని!'

'ఎందుకండీ!' అన్నది ఆవిడ నిద్రకళ్ళతో.

'అయితేచూడూ, మనప్రక్కవీధిలో ఆమొదటిఇంట్లో ఉన్నారు చూశావ్, ఒక తల్లీ, పిల్లానూ?'

'ఆ...ఎందుకూ?'

'వాళ్ళను నీవు ఎరుగుదువా?'

'ఆ ఎరుగుదును.'

'అయితే ఆఅమ్మాయి ఆ ముసలమ్మ కూతురేగదా?'

'ఆ'

'అయితే ఆపిల్లకు మొగుడు ఉన్నాడా?'

'ఎందుకండీ మీకి సంగతులన్నీ?'

'చాలా వ్యవహారం ఉందిలే!ఆపిల్లకుమొగుడున్నాడా లేదా? ఆసంగతి కొంచెం చెప్పు?'

'ఉన్నాడండీ...ఊళ్ళో వ్యవహారాలన్నీ మీకేకావాలె' అని ఆమె విసుక్కున్నది. ముసలాయనచాలాఆశ్చర్యపోయి నాడు.

'ఉంటే......'అని మాత్రం అని ముసలాయన ఆలోచనలోకి దిగాడు.

'ఏమిటండీ అల్లాగన్నారు?' అని అడిగింది ఆవిడబాగా మేలకువ తెచ్చుకొని.

'అహ ఏమీలేదుగాని నిజంగా ఉన్నాడంటావా?'

'నిజంగా ఉండటం ఏమిటండీ? అబద్ధంగా ఉంటారా ఏమిటి?'

'ఉంటే మరి...ఇదేమిటి?'

'ఏ మొచ్చింది?'

'కొంచం వ్యవహారం సాగుతున్నది.'

'చాల్లే ఊరుకోండి. ఆ అమ్మాయి అల్లాంటిదిగాదు. బంగారు తల్లి.'

జరిగిన కథఅంతా ఆవిడకు చెప్పటం ఈయనకుఇష్టం లేదు. అందుకని 'అయితేసరేపడుకో' అనిఆమెగారితో అని తానుమాత్రం ఈ విషయం ఆలోచించటానికిపూనుకొన్నాడు. పెండ్లి అయినపిల్ల అయిఉండికూడా ఎంతదుర్మార్గం చేయ టానికి సాహసిస్తుంది! ఎంత ఆలోచించినా ఆయనకు ఏమి చేయాలిసింది తోచలేదు. ఆ ఆలోచనతోనే ఆరాత్రి గడిచి పోయింది.

మరునాడు ఈ ముసలాయన ఇరవైమూడో క్రాసు రోడ్డు మొదటిఇంటిముందునిలబడి ఏదోతీవ్రంగా ఆలోచిస్తు న్నాడు. ఆయనముఖంలో విచారంనాలుగుచెంగులుపరుచుకు కూర్చున్నది, భయము తత్తరపాటు అటు ఇటు పరుగెత్తు తున్నాయి.

ముక్కూ ముఖం తెలియని వాళ్ళింటికి వెళ్ళి తలుపు కొట్టి పలుకరించాలంటే ఎవరికయినా బెరుగ్గానే ఉంటుంది.

కాసేపుతటపటాయించి, 'అంతేఅయిఉంటుంది.' అనుకొన్నాడు అంతకుపూర్వం మూడురోజులనుంచీ ప్రతిరోజూ ఆపిల్ల ఆ వేళకు కిటికీలో కూర్చుని వుండేది. ఇవ్వాళకపసడకపోవటం ఏమి? లోపల మనుష్యులున్నట్లు అలికిడికూడా ఏమీలేదు.

అప్పటికి ధైర్యంచేసి ఒకటి రెండుసార్లు పిలిచాడు. ఎవ్వరూ పలకలేదు. 'ఏమిటి ఇది! అనుకున్నంతపనిఅయిపో యిందా ఏమిటి కర్మం!' అని అనుకొని ఆయన రోడ్డుమీదికి వచ్చి నిలబడ్డాడు.

ఆ యింటికి సరిగ్గా ఎదురింట్లో ఉన్న ముసలమ్మ, పాలచెంబుతో వస్తున్నదిసరిగ్గా ఆసమయానికే. ఈపెద్దమనిషి రెండు అడుగులు ముందుకువేసి 'అక్కయ్యా ఈఇంట్లో ఎవ రూలేరా ఏమిటి?' అని అడిగాడు.

ఆ ముసలమ్మ కళ్ళకు చెయ్యి అడ్డంపెట్టుకొని చూచి ఈయనను గుర్తించి, 'నువ్వా, ఎవరో అనుకున్నాను. ఈఇంటో నిన్నటిదాకా ఉన్నారు ఎవరో ఒకతల్లీ, పిల్లానూ! మరిఇప్పుడు లేరేమో! అయితే ఒకటి. తెల్లవారుఝామున ఇక్కడి కేదో బండివచ్చింది. ఎవరో ఎక్కి వెళ్ళిపోయినారు.' అన్నది.

ఇంత ఆముసలమ్మతో అట్టేసేపు మాట్లాడవలసినఅవ సరంలేదని ఆయన వెంటనే నిశ్చయించుకొన్నాడు. ఇంకెం దుకూ! కావలసినది అయిపోయింది. ఆరాత్రి జాగ్రత్తపడాలి సింది! ఇప్పుడు ఏమనుకొంటే ఏమి లాభము!

ముసలాయన చాలా వ్యాకులతపొందాడు. ఈ ఘోర కార్యంజరగటానికితనబాధ్యతకూడాకొంతఉందనుకొన్నాడు.

ఎప్పుడైతే ఆకుర్రవాడిని అనుమానించాడో అప్పుడే తగిన జాగ్రత్తపడి ఉన్నట్లయితే ఇందాకా వచ్చేదికాదు.

ఈముసలాయన ఇరవై రెండో క్రాసురోడ్డు వంతెనపై కూర్చుని పళ్ళు తోముకుంటున్నాడు. తనను పలుకరించిన వాళ్ళతో జరిగినకథఅంతా పూసగ్రుచ్చినట్లు చెప్పాడు. చెట్టంత మనిషివి నీవు అక్కడ ఉండగానే జరిగిందీ ఈపని!' అని వాళ్లు ఆశ్చర్యాన్ని ప్రకటించి వెళ్ళిపోయినారు. ముసలాయన మనస్సు చివుక్కుమన్నది. చచ్చిన చావుఅయింది. తనకు ఎంత అపకీర్తి వచ్చింది!

పండంటి కాపురం పాడైపోయింది అనికొందరువిచారపడ్డారు. భార్యను ఇంట్లో కట్టేసుకోలేని ఆ వాజమ్మ ఎవరా అని కొందరు ఆశ్చర్యపోయినారు. ఎవరేమి అనుకుంటేనేమి ఘోరమైన పాపం జరిగిందని అంతా అన్నారు.

ఇంకో విశేషం ఏమిటీ అంటే, ఆపిల్ల అల్లాగ కిటికీలో నుంచిచూస్తూ ఉన్నప్పుడేచాలామందిఅనుకొన్నారట,ఈపిల్ల కాపురంచేసే పిల్లకాదు,ఎప్పుడో ఒకప్పుడు లేచిపోయేదేనని!!

'ఆ రాత్రి బందరునుంచివచ్చిన కుర్రవాడి మాటలను బట్టే నేను ఇంతపనీ అవుతుందని గ్రహించినాను' అని మన ముసలాయన అన్నాడు అందరితోనూ.

వీధివీధి అంతాకూడా ఈవిషయాన్ని గురించే మాట్లాడటం మొదలుపెట్టారు. ఈ సంగతివిన్న ప్రతివాడికీ, మళ్ళీ ఆసంగతి ఇంకొకడికి చెప్పిందాకా తోచేదికాదు.

ఆపిల్లదేతప్పుఅనికొందరన్నారు.ఆడవాళ్ళదేముందిఇటువంటి

విషయాల్లో మగవాడే మోసంచేస్తూఉంటాడనికొందరన్నారు పిల్లలను లేవదీసుకు పోవటాన్నిగురించి చాలాచర్చజరిగింది.

ప్రపంచంలో ఇల్లాంటివి ఎన్ని జరగలేదు! అయినా ప్రతిసారి ఈ విషయం చాలాక్రొత్తగానూ, ఉత్కర్షాహేతువుగానూ ఉంటూ ఉంటుంది.

ఇద్దరు వ్యక్తులు ఒకరినొకరు ప్రేమించుకొని లేచిపోతే, లోకానికి ఇంత హడావుడి ఎందుకో! లోకం మనకెందుకు అని పట్టించుకోకుండా ఉండదుగద!

ఈసంగతి మెల్లగా ఒక్కొక్కక్రాసురోడ్డేదాటింది.ఇరవైనాలుగో క్రాసురోడ్డులో జరిగింది జరిగినట్లుచెప్పుకొన్నారు. ఇరవై ఐదో క్రాసురోడ్డులో వాళ్ళిద్దరూ కూడా ఆస్తితో వెళ్ళిపోయినట్లుచెప్పుకొన్నారు. తరువాతవీధిలో వారికోసంపోలీసువారు వెదుకుతున్నట్లుతేలింది. ఇరవై ఎనిమిదోక్రాసురోడ్డులో చెప్పుకోటంలో అదిఆరోజునేజరిగిందన్నవిషయంజారిపోయి, ఎవరో బందరునుండి ఒకచిన్నవాడువచ్చి ఆపేటలోఉన్నఒకపిల్లను లేవతీసుకపోయినట్లు, వారు కొంతసొమ్ముతో పారిపోయి విజయనగంలో రాణిపేటలో కాపరం ఉంటూన్నట్లు తేలింది. ఈ విచిత్ర ప్రపంధానికి చివరిరెండు ప్రకరణాలు ఇరవైతొమ్మిది, ముప్పై క్రాసురోడ్లవారు, అపూర్వమైన వర్ణనలతో చేర్చారు.

ముప్పైయో క్రాసురోడ్డులో చెప్పుకొన్న వృత్తాంతము ఇది. బ్రాడీపేటలోఉన్న బ్రాహ్మణ పిల్లను, ఒక నాయుడు కుర్రవాడు లేవతీసుకుపోయినాడు. ఆపిల్ల కొంతసొమ్ముతో కూడా వెళ్ళిపోయింది. వాళ్ళు విజయనగరంలో రాణిపేటలో

కాపురం పెట్టారు. మొగుడూ పెళ్ళాలమని చెప్పుకొన్నారు. వాళ్ళకు ఒకపిల్లవాడుకూడా పుట్టాడు—ఇదీ కథ.

ఇది ఎప్పుడు జరిగింది అని ఎవ్వరూ విచారించలేదు. ఇంతపాపం ఎక్కడా జరగలేదనిమాత్రం అంతా అనుకొన్నారు. ఇదంతా జరిగేసరికి బాగా ప్రొద్దెక్కింది తొమ్మిది గంటలై యుంటుంది.

ఆసమయానికి కాఫీకని ముసలాయన ఇంటికిజేరి, భార్య యిచ్చిన వెచ్చవెచ్చని కాఫీ త్రాగుతూ అన్నాడు. 'ఏయ్! ఆపిల్ల లేచిపోయింది'

'ఏ పిల్ల?' అని ఆవిడ ఆశ్చర్యపోతూ అడిగింది.

'ఏపిల్లా! రాత్రి నీవు బంగారుతల్లి అన్నావే ఆపిల్లే!' అని అంటూ ఆయనమరికొంచెంకాఫీగ్లాసులోపోసుకొన్నాడు

ఆ ముత్తైదువ నిశ్చేష్టురాలై, నిలువునానిలబడిపోయి, తేరుకొని 'ఛా, ఎవరుచెప్పారండీ! మీకు?' అన్నది. 'ఒకరు చెపితే నేనునమ్మేవాడినిగాదు. ఓఅమ్మగన్నపిల్లపైలేనిపోని మాట అంటానికి నాకు మాత్రం మనస్సు ఒప్పుతుందా!' అని ప్రారంభించి గడిచినరాత్రి కుర్రవాడొకడుకనుపించటం అతడు ఆ పిల్లకోసం వచ్చినట్లు తాను అప్పుడే అనుమానపడటం, ప్రొద్దున్నే చూస్తే ఆపిల్ల ఇంట్లో లేకపోవటం, పిల్చినా ఎవ్వరూ పలకకపోవటం, మొదలైన విషయాలన్నీ పూసగ్రుచ్చినట్లు చెప్పాడు.

ఆమె చేతిలో గ్లాసు అక్కడే జారవిడిచి పరుగెత్తకపోయినా, అంత వేగంగా వెళ్ళింది ఇరవైమూడో క్రాసుతో

ద్దుకు. ఆమె ఆ యింటిముందు ఆగి వెనక్కు తిరిగిచూచింది. ఆమెగారి భర్త ఇరవై గజాల దూరంలో ఉన్నాడు! ఆయన వచ్చినదాకా ఆగింది. ఇరవై మూడో క్రాసురోడ్డుమీద ఉన్న మొదటి ఇంటితలుపు తీసేఉంది. ఇది ముసలాయనచూశాడు. చాలా ఆశ్చర్యపడ్డాడు. ఇందాక వేసిఉంది. తాను అనుకొన్నది పొరపాటా అని అనుకొన్నాడుగాని, మళ్ళీఅట్లాఎప్పటికీ కాదనే నిశ్చయానికే వచ్చాడు. పిల్ల లేచిపోతే మరి ఇంట్లో ఎవ్వరున్నట్లు? అదో పెద్ద ప్రశ్నాఏమిటి? ఆ ముసలమ్మ ఉన్నది అనుకొని నవ్వుకొన్నాడు.

ఆవిడను అడిగితే అన్నిసంగతులు తేలిపోతవిఎందుకింత గుంజాటన! అని అనుకొని ఇద్దరూ లోపల ప్రవేశించారు.

ముసలమ్మ 'అమ్మాయ్' అని పిలిచింది. గదిలోనుంచి 'ఎవరూ?' అని ఒక స్త్రీ కంఠస్వరం వినిపించింది, ఆపిల్లే అయి ఉంటుంది. ముసలాయన తెల్లపోయినాడు. ముసలమ్మగారు గర్వంగా నవ్వింది. ఇంతలో ఆపిల్ల రానేవచ్చింది.

ముసలాయనకు చాలా ఆశ్చర్యమూకలిగింది, విచారమూ కలిగింది. అపిల్లమీద అంతగా తాను అనుమానపడ్డం ఇంతలో ఆ అమ్మాయి వెనకాలే ఒక కుర్రవాడూ వచ్చాడు వెండికాఫీగ్లాసు చేత్తోపట్టుకొని.

ఎవరు ఆకుర్రవాడు! రాత్రి తానుచూచిన కుర్రవాడే! వీడి ఇల్లు బంగారంగాను, వీడు ఇక్కడే చేరాడన్నమాట! వీళ్ళిద్దరు లోపలఉండే పలుకలేదు తానుపిలిచినప్పుడు! పలకటానికి ధైర్యం ఎట్లాగుంటుంది. అందుకనే తలుపులువేసుకొని లోపలదాక్కున్నారు.ఇల్లాఅనుకుంటూనుంచున్నాడుఆయన.

ఆపిల్ల ముసలమ్మగారి దగ్గరకువచ్చి ఎదురుగా నిల బడి 'ఏం బామ్మగారూ ఇల్లా వచ్చారు? వచ్చినా సమయానికి వచ్చారులెండి' అని చాపమీద కూర్చోపెట్టి వెండిగ్లాసుతో కాఫీ ముందుబెట్టింది. 'నేను పుచ్చుకొంటానా తల్లీ? పెద్ద దాన్ని నేను కాఫీ పుచ్చుకొంటానా; అదిగో మీ బాబాయి కియ్యి' అని భర్తను చూపింది. 'ఇదండి బాబాయిగారూ'అని కాఫీగ్లాసు ఆయన ముందుపెట్టింది ఆపిల్ల.

'అమ్మ ఎక్కడుందమ్మా' అని అడిగింది ముసలమ్మ గారు. తెల్లవారుజామున రైలుకు వెళ్ళిపోయింది బామ్మగారూ అన్నది ఆపిల్ల. ఈమాట విన్నతరువాత తాతగారికి ఆ అబ్బాయినిచూస్తే ఒళ్ళుమండిపోయింది. ఈ పిల్ల ఒంటరిగా ఉండటంచూచి, ఎలాగో ఆపిల్లను ఇష్టపరచి, ఇంట్లో ప్రవే శించిన దుర్బుద్ధిఆకుర్రవాడు, అందువల్ల నేఆయనకుమనస్సు ఒప్పిందికాదు. అందుకని నిష్ఠూరంగా, ముఖం చిట్లించి అతనివంక చూస్తూ, 'రాత్రి నీవేకదూ మా యింటిముందు వంతెనపైన కూర్చున్నది!' అని అడిగాడు కఠినంగా. ఆ అబ్బాయి 'అవును నేనేనండీ' అన్నాడు వినయంగా.

'ఈ పిల్లకోసమే నీవు తిరుగుతున్నట్లు నాకు రాత్రే అర్థమైంది!!' అని నవ్వాడు ముసలాయన.

'ఉన్నసంగతే అదిగదండీ' అన్నాడు కుర్రవాడు.

'ఎన్నిరోజులుతిరిగావు?'తాతగారికికొద్దిగానవ్వువచ్చింది.

'మూడురోజులు, నిన్నమూడోరోజు!'

'ప్రసన్నురాలిని చేసుకొన్నావన్నమాట!'

'ఒక విధంగా'అన్నాడు ఆకుర్రవాడు తలవంచుకొని. ఇంకా నయమే సమయానికి వచ్చాను. ఆలస్యమయితే నేను అనుకొన్నంతపనీ అయ్యేది! ఈపిల్ల నీకేదో బంధువన్నావు కదూ? ఎందుకు అల్లా అన్నావు?' అన్నాడు ముసిలాయన.

'బంధువేనండి' అని కుర్రవాడు చిరునవ్వు నవ్వాడు.

ముసలాయనకు ఒళ్ళు మండిపోయింది. ఈ పిల్లవాడు ఇలాగ ధైర్యంగా సిగ్గూ బిడియంలేకుండా చెబుతూన్నజవాబు చూచి 'ఏమౌతుంది ఆ అమ్మాయి నీకు?' అని అడిగాడు గట్టిగా. గర్జించాడు భయంకరంగా.

కుర్రవాడు తెల్లముఖంవేస్తాడని అనుకొని ముసలాయన ఆ కుర్రవాడివంక తీక్ష్ణంగా చూశాడు. ఆ అబ్బాయి సిగ్గు పడుతూ, ఆపిల్లవంకచూచి 'ఏమౌతావే నాకు నీవు!' అని అడిగాడు.

ఆపిల్ల ముసిముసినవ్వులు నవ్వింది. సిగ్గుతో తలవంచుకొని

ఆ కుర్రవాడు ఆయనవంకచూస్తూ 'చిన్నతనంలోనే మాకు పెండ్లి అయింది. అప్పుడు ఈవిడనుచూపి అంతా,'నీ పెళ్ళాము' అనేవాళ్ళు. నన్నుచూపి ఆవిడతో 'నీమొగుడే!' అనేవాళ్ళు. ఇప్పుడు కాస్త తారుమారు అయింది ఆ వరస. ఆవిడేనాకు మొగుడు అయి కూర్చున్నది. ఆవిడమొగుడి తనం భరించలేకే నేను పొట్లాడి యింట్లోనుంచి వెళ్ళిపోయి, బజార్ల వెంట తిరిగాను ఈ మూడురోజులు. పోయినరాత్రే కాస్త రాజీకుదిరింది' అన్నాడు.

ముసలాయన, ముసలమ్మకూడా ఒకరిమొగాలు ఒకరు చూచుకొని నవ్వుకొన్నారు. ముసలాయనఆఅబ్బాయిని కౌగ

లించుకొని హృదయానికి అదుముకొంటూ 'భలేవాడివోయ్!' అన్నాడు.

ముసలమ్మగారు ఆపిల్ల చెక్కిళ్ళు నిమిరి తన కణత లకు నొక్కుకొని, 'చెప్పలేదండి! మా అమ్మాయి బంగారు తల్లి అని!' అని అన్నది.

ముసలాయన ఆ అమ్మాయి ఇచ్చిన కాఫీపుచ్చుకొని, ఇరవై మూడో క్రాసు రోడ్డునుంచి ముప్పైయో క్రాసురోడ్డు అవతలదాకా నడిచివెళ్ళాడు ఆపిల్ల సంగతియెత్తిన ప్రతి వాడిని 'ఛా, నోరుమూయ్ ఎవర్రా ఈసంగతి చెప్పిందినీకు!' అని కోప్పడుతూ.

★